సాక్షి
జోగుళాంబ గద్వాల
శుక్రవారం, 27, అక్టోబర్, 2023

హస్తం గూటికి..

- బీఆర్‌ఎస్‌కు ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి రాజీనామా
- 31న కాంగ్రెస్‌లో చేరికకు రంగం సిద్ధం
- తనయుడి వెంట ప్రచారానికి లైన్ క్లియర్



వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.0 /20.2

వాతావరణం

రోజంతా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమవుతుంది. సాయంత్రం చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

అర్థమయ్యే రీతిలో బోధన చేయాలి



మల్దకల్: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేసి వారి విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషిచేయాలని డీఈఓ సిరాజుద్దీన్ సూచించారు. గురువారం మండలంలోని పాల్వాయి జెడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాలలను డీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులకు సులభతరంలో పాఠాలు బోధించి వారి మేధాశక్తిని పెంచేందుకు కృషి చేయాలని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. ఉపాధ్యాయులు.. విద్యార్థుల సామర్థ్యాలను బట్టి బోధన చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు అల్పాహారాన్ని వడ్డించారు. కార్యక్రమంలో ఎంఈఓ కొండారెడ్డి, హెచ్‌ఎంలు రసింహస్వామి. కుసుమలత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మాటలు నమ్మి మోసపోవద్దు



గద్వాల అర్బన్: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని జెడ్పీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ అభ్యర్థి సరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో గట్టు మండలంలోని అలూరు, ధరూర్ మండలంలోని చిన్నపాడు, చింతరేవుల, వామన్‌పల్లి, సొంపురం, పార్చర్ల, రేవులపల్లి, గార్లపాడు, మల్దకల మండలంలోని కుర్తిరావుల్ చెరువు, సద్దనోనిపల్లి, గద్వాల మండలంలోని పుటాన్‌దొడ్డి, పరుమాలకు చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ను నమ్మి వారికి ఓటేసీ మళ్లీ మోసపోవద్దన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని ధరూర్‌మెట్టు వద్ద నుంచి జెడ్పీ క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలి



గద్వాల అర్బన్: వెల్ఫేర్ బోర్డు నిధులు కార్మికుల సంక్షేమానికే ఖర్చు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగూరు రాములు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు తీవ్రతరమవుతున్నాయని, ముడి సరుకుల ధరలు పెరగడంతో కార్మికులకు ఉపాధి దొరక్క ఆర్థిక ఇబ్బందులు, పేదరికంతో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెల్ఫేర్ బోర్డులో రూ.4200కోట్లు ఉన్నాయని, జిల్లాలో వేలాది మంది నిర్మాణ కార్మికులకు పరిహారం కొరకు దరఖాస్తు చేసుకొని ఏళ్లు గడుస్తున్నా ఇవ్వడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెల్ఫేర్ డబ్బులు కార్మికుల సంక్షేమం కోరకు ఖర్చు చేయకుండా ఇతర సంక్షేమానికి బదిలీ చేసిందని, ఇది చట్టరీత్యా నేరమని, తక్షణమే వాటిని వెల్ఫేర్ బోర్డులో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో రాజకీయ మేనిఫెస్టోలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలు చేర్చి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వివి నర్సింహ్మా, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేష్, కమిటీ సభ్యులు సీతారాములు, శాంతిరాజు ఉన్నారు.

పీయూలో సోలార్ ప్యానెల్స్ యూనిట్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో అడ్మినిస్ట్రేషన్ భవనంపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్స్ యూనిట్‌ను పీయూ రిజిస్ట్రార్ గిరిజ, ఓఎస్డీ మధుసూదన్ రెడ్డి పరిశీలించారు. రూ.60లక్షలకు పైగా ఖర్చు చేసి యూనివర్సిటీలోని అన్ని భవనాలకు విద్యుత్ సరఫరా కోసం ప్యానెల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒప్పందంలో భాగంగా నాణ్యతా ప్రమాణాల ప్రకారం ప్యానెల్స్ ఉన్నాయా లేదా అని పరిశీలించారు.

వలసలు ఆపి.. వరిని పెంచాం

ప్రజా ఆశీర్వాద సభల్లో ముఖ్యమంత్రి కేసీఆర్

- ఎడారిగా ఉన్న తెలంగాణను పూల పొదరిల్లుగా మార్చినం
- ప్రతి పైసాను జాగ్రత్తగా ఖర్చు చేసి.. అభివృద్ధి చేస్తున్నాం
- కల్వకుర్తి ఎత్తిపోతలతో ప్రతి ఎకరాకు సాగునీరు
- వనపర్తి, అచ్చంపేటలకు వరాల జల్లు



సీఎం కేసీఆర్‌తో ముచ్చటిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/సాక్షి, నాగర్‌కర్నూల్/ వనపర్తి/అచ్చంపేట: పొట్ట కూటి కోసం వలస వెళ్లే ఉమ్మడి పాలమూరులో కేఎల్‌ఐ ప్రాజెక్టుతో సాగునీరు తీసుకువచ్చి వలసలను ఆపి.. వరిని పెంచామని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట, వనపర్తి జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభలకు సీఎం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల వేళ అవాక్కులు.. చవాక్కులు పేల్చుతున్న కాంగ్రెస్ నాయకుల పాలనలో గంజి, అంబలి కేంద్రాలతో పాపగ్రస్తమైన పాలమూరును అన్నపూర్ణగా మార్చింది తెలంగాణ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. పాలమూరులో మంత్రులుగా పనిచేసిన వారెవరూ చేయలేనిది.. ఐదు జిల్లాలకు ఐదు మెడికల్ కళాశాలలు సాధించింది ప్రస్తుత మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డిలే అని కొనియాడారు. జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరందించేందుకు నాతో కొట్లాడి లిఫ్టులు మంజూరు చేయించుకున్న నిరంజన్‌రెడ్డి ఇటీవల ప్రారంభించుకున్న పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నుంచి వనపర్తి జిల్లాకు సాగునీరు తీసుకునేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారని, కాల్వలు త్వరలో వస్తాయని పేర్కొన్నారు. దశాబ్దాలు పాలించిన కాంగ్రెస్ పార్టీ ముస్లింలు, దళితులు, రైతులను కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా రైతుబంధు పథకం అమలు చేయడంతో పాటు వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్నారు. ముస్లింల కోసం ప్రత్యేక గురుకులాలను ఏర్పాటు చేశామన్నారు. కొత్త రాష్ట్రంలో ప్రతి పైసాను జాగ్రత్తగా వెచ్చించి.. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. చేసిన అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఆశీర్వదించాలని ప్రజలకు కేసీఆర్ సూచించారు.

ఆశీర్వదించండి: నిరంజన్‌రెడ్డి



'నాకు ఎమ్మెల్యేగా అవకాశమిచ్చిన ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా నియోజకవర్గాన్ని గర్వించేలా అభివృద్ధి చేశాను. చేసిన పనులను చూసి ఆశీర్వదించండి. అని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి కోరారు. నియోజకవర్గానికి భవిష్యత్‌తో సాగు, తాగు నీటి సమస్యలు తలెత్తకుండా తలపై నిండు కుండలా పాలమూరు ప్రాజెక్టులో భాగంగా ఏదుల వద్ద రిజర్వాయర్ నిర్మాణం చేసుకున్నామన్నారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతంగా బాసిల్లనున్న వనపర్తి జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పేందుకు ఇప్పటికే 400 ఎకరాల భూమిని కేటాయించామని, పంటల సాగుకు అనుకూలంగా పరిశ్రమలు ఏర్పాటుకు ప్రోత్సాహం అందిస్తున్నామని చెప్పారు. సాగునీటి విషయంలో సాధించిన పురోగతికి సీఎం కేసీఆర్ అందించిన ప్రోత్సాహమే ప్రధాన కారణం అన్నారు.

అచ్చంపేట ప్రజలే నన్ను కాపాడాలి: గువ్వల

'నాపై ఎన్నో కుట్రలు జరుగుతున్నాయని నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసు. .అచ్చంపేట ప్రజలే నాకు సర్వస్వం.. మీరే ఊపిరి, శ్వాసగా బతుకుతా.. నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు మీ మధ్యనే ఉండి అచ్చంపేటను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా.. మీరే నన్ను కాపాడాలి' అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు భావోద్వేగంతో మాట్లాడారు. నా రాజకీయ భవిష్యత్ సీఎం కేసీఆర్ చేతుల్లోనే ఉందని, తాను అడిగే హామీలన్నీ నెరవేర్చాలని కోరారు. అచ్చంపేట అన్ని రంగాల్లో వెనకబడిందని, సీఎం కేసీఆర్ దీవెనలతో అభివృద్ధి పథంలో నడిపించానన్నారు. పాలిటెక్నిక్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, నర్సింగ్ కళాశాలను మంజూరు చేయాలని కోరారు. నక్కలగండి ప్రాజెక్టు, మన్నెవారిపల్లి రైతులను ఆదుకోవాలని, నియోజకవర్గం మొత్తం దళితబంధు ప్రకటించాలని, మద్దిమడుగు సమీపంలో కృష్ణానదిపై వంతెన నిర్మాణం చేపట్టాలని కోరారు.

3 రిజర్వాయర్లు.. 2 లక్షల ఎకరాలకు సాగునీరు

తెలంగాణ ప్రజలకు అచ్చంపేట సభ నుంచి మనవి చేస్తున్నా.. మంచి సమాజం నిర్మాణం జరగాలి.. సాగునీటి వనరులు పెరగాలి. గువ్వల బాలరాజు నా దగ్గరకు వచ్చి అందరికీ పాలమూరు ప్రాజెక్టు వస్తోంది. నాకు అప్పర్ ప్లాట్ ఉందని, 60 వేల ఎకరాలకే సాగునీరు వస్తుందని చెబితే... ఆలోచించి ఉమామహేశ్వర లిఫ్టు మంజూరు చేసుకున్నాం.. మూడు రిజర్వాయర్ల నిర్మించి 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని కేసీఆర్ అన్నారు. కేసీఆర్‌కు భగీరథుడు అన్న పేరు ఉందని, అప్పర్ ప్లాట్‌కు కూడా నీళ్లు తీసుకొచ్చి ఇచ్చే బాధ్యత నాదే అన్నారు. పాలమూరు– రంగారెడ్డి పథకం ద్వారా నల్లగొండ జిల్లాకు సైతం నీరు ఇవ్వాల్సి ఉందన్నారు. వెనకబడిన అచ్చంపేటలో నర్సింగ్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, పాలిటెక్నికల్ కళాశాలు కావాలని గువ్వల బాలరాజు కోరారని, న్యాయమైన వాటిని తీరుస్తామని, ప్రభుత్వం వచ్చిన నెలరోజుల్లో జీఓలు ఇచ్చి అందుబాటులోకి తెస్తామని చెప్పారు. పోడు భూములకు పట్టాలు ఇచ్చి రైతుబంధు వర్తింపజేశామని, గిరిజనులపై ఉన్న ఎత్తివేశామని, మిగిలిన వారికి సైతం త్వరలోనే పోడు పట్టాలు ఇస్తామన్నారు. ఎన్నికల తర్వాత నల్లమల అటవీ ప్రాంతంలోని ఉమామహేశ్వరం, సలేశ్వరం ప్రాంతాలకు ఇంకో టూరిజం వచ్చే అవకాశం ఉందని, ఒకరోజు రాష్ట్రస్థాయి అధికారులను తీసుకుని నేను ఇక్కడే ఉండి ఆ పనులు పూర్తి చేస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

రాయేదో.. రత్నమేదో చూసి ఓటేయండి

దశాబ్దాలుగా చేయలేని అభివృద్ధిని.. పదేళ్ల కాలంలో చేసి చూపించిన వారిలో రాయేదో.. రత్నమేదో గుర్తించి రానున్న ఎన్నికల్లో ఓటు వేసి ఆశీర్వదించాలి. అడ్డం.. పొడవు ఎక్కువ ఉన్నోళ్లు ఎన్నికల సమయంలో ఇళ్ల ముందుకు వచ్చి అబద్ధాలు చెప్పే ప్రయత్నం చేస్తారు. వారి మాటలు నమ్మి మోసపోవద్దని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో అగ్రవర్ణాలకు ప్రత్యేక గురుకులాలను ఏర్పాటు చేయాలని ఈ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచామన్నారు. ప్రస్తుత గురుకులాల్లో వజ్రాల్లాంటి విద్యార్థులు తయారవుతున్నారని వివరించారు.

జీవనదిగా దుందుభీ

జంగ్ తెలంగాణ

వచ్చే దారిలో డిండి ప్రాజెక్టు చూశా.. చాలాదూరం దుందుభీ నది, బాలరాజు కట్టించిన చెక్‌డ్యాంలు కనిపించాయని.. ఒకప్పుడు దుందుభీ దుమ్ములేచి పోయేదని.. గోరటి వెంకన్న సైతం వాగు ఎండిపోయెరా అనే పాట పాడారని, ఇప్పుడు దుందుభీ జీవనదిగా మారిందని కేసీఆర్ అన్నారు.

దుమ్ము దులపాలి..

అమ్రాబాద్‌కు నీళ్లు పోతాయని ఎవరూ ఊహించలేదని, అధికారులు 650 మీటర్ల ఉందని చెబితే 1,200 ఉన్నా సరే నీళ్లు ఇవ్వాలని గట్టిగా చెప్పానని పేర్కొన్నారు. కేసీఆర్ దమ్ము సంగతి దేశం మొత్తం చూసిందని, ఈ జనం అంతా కేసీఆర్ దమ్ము కాదా అన్నారు. మీ బలం అంతా ఉపయోగిస్తే అచ్చంపేట దుమ్ము లేస్తోందని, నవంబరు 30న మీరు రేపే దుమ్ము, బాలరాజును భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. మనిషి అన్నప్పుడు మంచి, చెడు ఉంటుందని, మీ బలం ఓటుతో చూపించాలని కోరారు.



వనపర్తిలోని పాలిటెక్నిక్ కళాశాల మైదనంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం



అచ్చంపేట సభలో రెండు చేతులు పైకి ఎత్తి 'ధరణి'కి మద్దతు తెలుపుతున్న ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణులు

● అటు ఎంపీ.. ఇటు జెడ్పీ చైర్మన్

సీఎం సభకు డుమ్మా..!

- 'గులాబీ' శ్రేణుల్లో జోరుగా చర్చ
- లోక్‌నాథ్‌రెడ్డి బీజేపీలో చేరతారనే ప్రచారం
- ఎమ్మెల్యేగా బరిలో దిగుతున్నట్లు ఊహాగానాలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఉమ్మడి పాలమూరులోని అచ్చంపేట, వనపర్తిలో బీఆర్‌ఎస్ గురువారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు పలువురు ముఖ్య నేతలు హాజరుకాకపోవడం హాట్‌టాపిక్‌గా మారింది. పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ స్వయంగా హాజరైన ఈ సభలకు దూరంగా ఉండడంపై పలు ఊహాగానాలు వెల్లువెత్తున్నాయి. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోనే జరిగిన సభలకు రెండు చోట్ల ఎంపీ పోతుగంటి రాములు రాలేదు. వనపర్తిలో జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి సైతం పాల్గొనకపోవడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది. తన కుమారుడి రాజకీయ భవిష్యత్‌లో భాగంగా అచ్చంపేట ఎమ్మెల్యే సీటును ఎంపీ రాములు ఆశించారు. అయితే సిట్టింగ్ ఎమ్మెల్యే గువ్వలకే మళ్లీ అవకాశం కల్పించడంతో ఆయన మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే సీఎం సభకు దూరంగా ఉన్నారా.. వేరే కారణాలు ఏమైనా ఉన్నాయా.. అని పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది.

అలిగారా.. ప్రాధాన్యం లేకనా..



ఎంపీ పోతుగంటి రాములుకు అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మధ్య విభేదాలు ఎప్పటి నుంచో ఉన్నాయి. ఎంపీ కుమారుడు, కల్వకుర్తి జెడ్పీటీసీ సభ్యుడు భరత్‌ప్రసాద్ నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ చైర్మన్ పీఠంపై మొదటి నుంచీ ఆశలు పెట్టుకున్న విషయం తెలిసిందే. తొలుత ఆయనకు అవకాశం ఇవ్వకుండా తెలకపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు పద్మావతికి అవకాశం కల్పించారు. అనంతర పరిణామాల క్రమంలో ఆమెపై వేటు పడగా.. భరత్ ప్రసాద్ మళ్లీ ప్రయత్నాలు చేశారు. కానీ ఊర్కొండ జెడ్పీటీసీ సభ్యురాలు శాంతకుమారికి జెడ్పీ చైర్‌పర్సన్ పదవి కట్టబెట్టారు. దీంతో ఆ సమయంలోనే తనకు పదవి రాకుండా ఎమ్మెల్యే గువ్వల అడ్డుపడుతున్నాడని బహిరంగంగా ఆరోపించిన భరత్ ప్రసాద్ అచ్చంపేట నుంచి ఎమ్మెల్యేగా పోటీచేయనున్నట్లు ప్రకటించాడు. ఈ క్రమంలో ఫ్లెక్సీల వార్ నడవగా.. ఎంపీ రాములు, ఎమ్మెల్యే గువ్వల మధ్య వాగ్వాదం సైతం చోటుచేసుకుంది. అనంతరం పరిణామాల క్రమంలో గువ్వలకే ఎమ్మెల్యే అభ్యర్థిత్వం ఖరారు కాగా.. ఎంపీ గుంభనంగా ఉన్నారు. తాజాగా సీఎం సభకు గైర్హాజరు కావడం ఎమ్మెల్యే, ఎంపీ మధ్య మరింత దూరం పెరిగినట్లు శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. ఎంపీ అలిగారా లేక ప్రాధాన్యం ఇవ్వకపోవడంతోనే దూరంగా ఉన్నారా అనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఎంపీ రాములును సాక్షి ఫోన్‌లో సంప్రదించగా.. 'జ్వరంతో బాధపడుతున్నా.. హైదరాబాద్‌లో ఉన్నా..అందుకే రాలేకపోయాను' అని ఆయన సమాధానమిచ్చారు.

జెడ్పీచైర్మన్ దారెటో?



వనపర్తిలోని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ సభకు జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి గైర్హాజరు కావడం.. సీఎం హాజరైన సభలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ఆయన ఫొటో కూడా లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. మంత్రి నిరంజన్‌రెడ్డికి వ్యతిరేకంగా అసమ్మతి గళం విన్పించిన ఆయన కొన్ని నెలల క్రితం బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. కొన్నాళ్లు దూరంగా ఉండగా.. ఆ తర్వాత పరిణామాల క్రమంలో మళ్లీ బీఆర్‌ఎస్‌లో చేరారు. మళ్లీ ఇటీవల కాలంగా మంత్రితో దూరంగా ఉంటున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆయన సభకు గైర్హాజరు కాగా.. పార్టీ శ్రేణుల్లో గుసగుసలు విన్పిస్తున్నాయి. బీజేపీ నాయకులతో ఆయన టచ్‌లో ఉన్నారని.. ఆ పార్టీ నుంచి వనపర్తి ఎమ్మెల్యేగా బరిలోకి దిగనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై జెడ్పీ చైర్మన్‌ను ఫోన్‌లో సంప్రదించగా.. 'బీజేపీ నాయకులు సంప్రదించిన మాట వాస్తవమే.. కానీ నేను ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ రోజు సీఎం సభకు వ్యక్తిగత కారణాలతో హాజరుకాలేదు. మంత్రి స్వయంగా సభకు రావాలని పిలిచారు.' అని సమాధానమిచ్చారు. ప్రస్తుతం చోటుచేసుకున్న ఈ పరిణామాలను బట్టి అటు ఎంపీ, ఇటు జెడ్పీ చైర్మన్ దారెటోననే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

సెక్టోరియల్ అధికారులే కీలకం



మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్: శాసనసభ ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారుల బాధ్యతలే కీలకమని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం ఐడీవోసీ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులకు మాస్టర్ ట్రైనర్లతో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సెక్టోరియల్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఈవీఎం, వీవీప్యాట్లు, హ్యాండ్‌బుక్, పోలింగ్ కేంద్రాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధానంగా పోలింగ్ కేంద్రాలలో బ్యాలెట్‌యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు వీవీప్యాట్లు అమర్చడం, మాక్‌పోలింగ్ నిర్వహించడం వంటివాటిపై పూర్తిగా అవగాహన ఉండాలని, ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించే క్రమంలో అవసరమైన బందోబస్తుతో ఏర్పాటు చేసుకోవాలన్నారు. కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు పోలింగ్‌కు ఒకరోజు ముందుగానే చేరుకోవాలని, పోలింగ్‌రోజు ఉదయం 5:30గంటలకే మాక్‌పోలింగ్ నిర్వహించి ఉదయం 7గంటలకు పూర్తిస్థాయిలో పోలింగ్‌ను మొదలుపెట్టాలన్నారు. పోలింగ్ అనంతరం సామగ్రిని స్ట్రాంగ్‌రూంలకు తరలించే క్రమంలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, అలంపూర్, గద్వాల నియోజకవర్గాలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ కౌంటర్లు శిక్షణ కేంద్రాలలోనే ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అపూర్వచౌహాన్, చీర్ల శ్రీనివాసులు, అలంపూరు ఆర్వో ఆర్డీవో చంద్రకళ, మాస్టర్‌ట్రైనర్లు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

రూ.2లక్షల నగదు రైతుకు అప్పగింత

ఎన్నికల కోడ్ నిబంధనల పరిమితికి మించి రూ.2లక్షలను వెంట తీసుకెళ్తున్న రైతు బ్రహ్మయ్య నుంచి గురువారం గద్వాల రూరల్ పీఎస్ పరిధిలో ఎన్నికల అధికారులు స్వాధీనం చేసుకుని గ్రీవెన్స్ కమిటీకి అప్పగించారు. అయితే జమ్మిచేడుకు చెందిన సదరు రైతు బ్రహ్మయ్య రూ.2లక్షలకు సంబంధించి తగిన డాక్యుమెంట్లు సమర్పించడంతో రూ.2లక్షలను తిరిగి రైతుకు అప్పగించినట్లు అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు తెలిపారు.

విద్యార్థుల కోసమే ఓపెన్‌హౌస్

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి పదో బెటాలియన్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాలలో భాగంగా గురువారం ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్‌లో సిబ్బంది ఆయా పాఠశాలల విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమాండెంట్ సాంబయ్య హాజరై మాట్లాడారు. ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించడం వల్ల విద్యార్థులకు పోలీసులు అంటే భయం పోతుందన్నారు. అలాగే సమాజంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ కూడా బలపడుతుందన్నారు. విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన కల్పించి, పోలీస్ వ్యవస్థ యొక్క పనితీరును గురించి ఆయన వివరించారు కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ నాగభూషణం, ఆర్ఐలు రాజారావు, రాజు, వెంకటేశ్వర్లు, సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.



విద్యార్థులతో కమాండెంట్ సాంబయ్య


అచ్చంపేటలో..


వనపర్తి సభలో యువత కేరింత..


వనపర్తి సభకు హాజరైన బీఆర్ఎస్ నాయకులు

గులాబీ జోష్..



అచ్చంపేట, వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో గురువారం సీఎం కేసీఆర్ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ గులాబీ శ్రేణుల్లో జోష్ నింపింది. ఆయా నియోజకవర్గాల నుంచి సభకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. సభా ప్రాంగణాలు గులాబీమయంగా మారాయి. కళాకారులు ఆటాపాటలతో ఉర్రూతలూగించారు. సీఎం కేసీఆర్ ప్రసంగం పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపింది. ఆయా సభల్లో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి, ఎమ్మెల్యేలు కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఆల వెంటేశ్వర్‌రెడ్డి, అబ్రహం, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, మధుసూదనాచారి, మాజీ ఎంపీ మందాజగన్నాథం, గిడ్డంగుల చైర్మన్ రజని, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, అచ్చంపేట ఎన్నికల ఇన్‌చార్జ్ ఇంతియాజ్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, ఆయా మండలాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. - వనపర్తి/అచ్చంపేట/అచ్చంపేట రూరల్


అచ్చంపేటలో..


వనపర్తిలో మధుప్రియ బృందం ఆటాపాట


వనపర్తిలో బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు


వనపర్తిలో మహిళా కార్యకర్త జోష్..


అచ్చంపేటలో నినాదాలు చేస్తున్న గిరిజన మహిళలు


వనపర్తిలో ఈల వేస్తున్న కార్యకర్త

అచ్చంపేట సభ సైడ్‌లైట్స్..

- ఉదయం 11 గంటల నుంచే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వివిధ వాహనాల్లో అచ్చంపేటకు చేరుకున్నారు.
- 12:30 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్న కార్యకర్తలు, జనం
- మధ్యాహ్నం 2 గంటల నుంచి ఏపూరి సోమన్న కళాకారుల ఆటాపాట
- 2:30 గంటలకు సింగర్ లక్ష్మక్క పాడిన రామక్క పాట హుషారెత్తించింది.
- 2:37 గంటలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సభావేదికపై నుంచి నాయకులు, కార్యకర్తలకు హితోపదేశం చేశారు. సీఎం కేసీఆర్ సభపైకి రాగానే అందరూ లేచి నిలబడి ఆహ్వానించాలని సూచించారు.
- 3:07 గంటలకు సీఎం కేసీఆర్ హెలిక్యాప్టర్ కనిపించగా.. జనం కేరింతలు కొట్టారు. సభా ప్రాంగణం చుట్టూ రెండు సార్లు హెలిక్యాప్టర్ చక్కర్లు కొట్టింది.
- 3:10 గంటలకు హెలిక్యాప్టర్ నుంచి సీఎం కేసీఆర్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్ దిగారు.
- 3:15 గంటలకు సభా ప్రాంగణానికి సీఎం కేసీఆర్ చేరుకుని ప్రజలకు అభివాదం చేశారు.
- 3:16 గంటలకు తనకు కేటాయించిన కుర్చీలో కూర్చొని, అక్కడే ఉన్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో ముచ్చటించారు.
- 3:26 గంటలకు కేసీఆర్ ప్రసంగం ప్రారంభించి, 3:54 గంటలకు ముగించారు.

వనపర్తి సభ..

- సాయంత్రం 4:20 గంటలకు సీఎం కేసీఆర్ వనపర్తికి చేరుకున్నారు.
- హెలిప్యాడ్ నుంచి వేదిక వద్దకు 4:30 గంటలకు వచ్చారు.
- సుమారు 21 నిమిషాలపాటు ప్రజలనుద్దేశించి సీఎం మాట్లాడారు.

క్లుప్తంగా

టీపీసీసీ అధికార ప్రతినిధుల నియామకం

స్టేషన్ మహబూబ్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ నియోజకవర్గాలకు ఏఐసీసీ మీడియా కోఆర్డినేటర్, టీపీసీసీ అధికార ప్రతినిధులను నియమించారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గాల ఏఐసీసీ మీడియా కోఆర్డినేటర్‌గా అన్వుమాన్, మహబూబ్‌నగర్ టీపీసీసీ అధికార ప్రతినిధిగా జి.హర్షవర్ధన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ప్రతినిధులుగా జహీర్ అక్తర్, షేక్షావలీలు నియమితులయ్యారు.

కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు



మాగనూర్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను నమ్మి తెలంగాణ ప్రజలు మోసపోవద్దని కర్ణాటక రైతులు అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంపై గురువారం నారాయణపేట జిల్లా మాగనూర్ మండలం భైరంపల్లి, బద్దెపల్లి గ్రామాల మధ్యనున్న తెలంగాణ సరిహద్దులో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్ణాటకలో తాము కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి చాలా నష్టపోయామని వాపోయారు. తెలంగాణ సమీపంలోని రాయచూర్, యాద్గిరి జిల్లాల్లో వ్యవసాయానికి కనీసం మూడు గంటలు కూడా కరెంట్ ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు ఎండిపోతుండటంతో ట్యాంకర్లతో నీరందిస్తున్నామని.. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పిన మాటలతో మోసపోయామని వాపోయారు.

హస్తం గూటికి..

- బీఆర్ఎస్‌కు ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి రాజీనామా
- 31న కాంగ్రెస్‌లో చేరికకు రంగం సిద్ధం
- తనయుడి వెంట ప్రచారానికి లైన్ క్లియర్

సాక్షి, నాగర్‌కర్నూల్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి గురువారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈనెల 31న కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకాగాంధీ సమక్షంలో హస్తం గూటికి చేరనున్నట్టు ప్రకటించారు. రాజీనామా ప్రకటన నేపథ్యంలో ఇకపై ఆయన తనయుడు, నాగర్‌కర్నూల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి రాజేశ్‌రెడ్డి తరఫున నేరుగా ప్రచారంలో పాల్గొననున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ పదవికి సైతం రాజీనామా చేసే విషయమై నిర్ణయం తీసుకుంటానని గురువారం కొల్లాపూర్‌లో ప్రకటించారు.

సర్పంచ్ నుంచి ఎమ్మెల్సీ స్థాయికి..

ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం సర్పంచ్ స్థాయి నుంచి మొదలై ఎమ్మెల్సీ స్థాయికి ఎదిగారు. మొదటగా ఆయన 1980లో కాంగ్రెస్‌లో చేరి రాజకీయ అరంగేట్రం చేశారు. 1981 నుంచి 1991 వరకు నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తి సర్పంచ్‌గా సేవలందించిన ఆయన అనంతరం 1991 నుంచి 1996 వరకు ఎంపీపీగా పనిచేశారు. 2006 లో నాగర్‌కర్నూల్ నుంచి జెడ్పీటీసీగా గెలిచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జెడ్పీ చైర్మన్‌గా పనిచేశారు. ఈ క్రమంలో 1999, 2004, 2009, 2012 ఎన్నికల్లో నాగం జనార్దన్‌రెడ్డిపై, 2014లో మర్రి జనార్దన్‌రెడ్డిపై ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2015లో కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ తరఫున మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా గెలుపొందారు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరారు. 2021లో ప్రభుత్వం ఆయన్ను మరోసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించింది.

బీఆర్ఎస్‌లో గౌరవం లేదు: ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి

బీఆర్ఎస్ పార్టీలో తనకు తగిన గౌరవం లభించడం లేదని ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గత నాలుగున్నర ఏళ్లుగా సీఎం కేసీఆర్‌ను కలిసేందుకు కనీసం అపాయింట్‌మెంట్ కూడా దొరకని పరిస్థితి నెలకొందని వాపోయారు. తాను జెడ్పీ చైర్మన్‌గా ఉన్నప్పుడు పదిరోజులకు ఓసారి అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని కలిసేవాడినని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణయం ప్రకారమే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని సైతం ప్రకటించారు. బీఆర్ఎస్‌కు రాజీనామాతో నేటినుంచి తనయునితో పాటు కాంగ్రెస్ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు రంగం సిద్ధమైంది.

పోలీసుల అండతో అరాచకాలు

- మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు
- ప్రియాంక గాంధీ సభాస్థలం పరిశీలన


సమావేశంలో మాట్లాడుతున్న జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్: బీఆర్ఎస్ పాలనలో పోలీసులను అడ్డుపెట్టుకొని దుర్మార్గాలు, అరాచకాలు సాగిస్తున్నారని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈనెల 31న కొల్లాపూర్‌లో ప్రియాంక గాంధీ సభ ఏర్పాటుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని స్థలాన్ని గురువారం జూపల్లితో పాటు టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, ఎన్నికల పర్యవేక్షకుడు పీవీ మోహన్, రాష్ట్ర నాయకుడు కేతూరి వెంకటేష్ పరిశీలించారు. అనంతరం జూపల్లి విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీఆర్ఎస్‌ను పాతాళంలో పాతిపెట్టాలన్నారు. రాష్ట్ర సాధన కోసం ప్రజలంతా సంఘటితమయ్యారని, రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించేందుకు మరో తెలంగాణ ఉద్యమం సాగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తున్న అవినీతి, నియంత పాలనను అంతమొందించాలని పిలుపునిచ్చారు. మల్లురవి మాట్లాడుతూ 2లక్షల మందితో ప్రియాంకగాంధీ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు తరలివస్తారని తెలిపారు. బీఆర్ఎస్‌ను గద్దె దించేందుకు సమయం ఆసన్నమైందన్నారు. కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో రహీంపాషా, హన్మంతునాయక్, రఘుపతిరావు, నయ్యూం, బాలస్వామి, నర్సింహ తదితరులు ఉన్నారు.

మద్యం పట్టివేత

జడ్చర్ల టౌన్: పట్టణంలోని రైతుబజార్ సమీపంలోగల రెండు బెల్టు దుకాణాల్లో రూ.10వేల విలువగల మద్యాన్ని పట్టుకుని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అదేవిధంగా బెల్టు దుకాణాల్లో మద్యం విక్రయిస్తూ పట్టుబడిన 23మందిని తహసీల్దార్ శ్రీనివాసులు ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

కృష్ణా: గోవా నుంచి తరలిస్తున్న 12.5 లీటర్ల మద్యాన్ని కృష్ణా మండల సరిహద్దులోని చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్నట్లు మహబూబ్‌నగర్ ఏపీఈఎస్ నర్సింహారెడ్డి, ఎక్సైజ్ ఎస్ఐ సతీష్ తెలిపారు. గోవా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్, ఆనంద్ పాల్గొన్నారు.



పొగ కష్టాలకు విముక్తి కల్పిస్తాం

- రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్


పాలకొండలోని తిరుపతమ్మ ఇంటి వద్ద జొన్నరొట్టె తింటున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్ మూషా నరేందర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఇంకా అక్కడక్కడా కట్టెల పొయ్యిపై మహిళలు వంట చేస్తున్నారంటే అందుకు కేంద్రంలోని బీజేపీ విధానాలే కారణమని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. గురువారం ఉదయం పాలకొండలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆ కాలనీలోని తిరుపతమ్మ ఇంటికి వెళ్లగా అక్కడ ఆమె కట్టెల పొయ్యి మీద వంట చేస్తూ కనిపించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ధరలు పెంచడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని, రాష్ట్రంలో తాము మళ్లీ అధికారంలోకి వచ్చాక ఈ కష్టాలు తీరుస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం ఎదిరలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ అమలు కాని హామీలతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ వంచిస్తోందని ఆరోపించారు. కర్ణాటక రాష్ట్రంలో నాలుగు నెలలైనా ముగియకముందే సరైన విద్యుత్ ఇవ్వకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. అక్కడ వారు ఎదుర్కొంటున్న కరెంటు కష్టాలను అందరి దృష్టికి తెచ్చేందుకే కొడంగల్, గద్వాలకు వచ్చి ఆందోళనలకు దిగారని గుర్తు చేశారు. తెలంగాణలో అమలవుతున్న రైతుబంధు పథకం ద్వారా రైతులకు జరుగుతున్న లబ్ధిని చూసి ఓర్వలేక కాంగ్రెస్ పార్టీ నాయకులు కుట్రతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నారన్నారు.ఎన్నికలకు కేవలం నెల రోజులు మాత్రమే ఉండే ప్రతిపక్షాల నాయకులు నవంబర్ 30 తర్వాత పత్తా లేకుండా పోతారన్నారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీబీ వైస్ చైర్మన్ కె.వెంకటయ్య, ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ చైర్మన్ తాటి గణేష్‌కుమార్, కౌన్సిలర్లు మూషా నరేందర్, తోకల యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రూ.7.49 లక్షల నగదు సీజ్


కృష్ణా చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన నగదుతో పోలీసులు

నారాయణపేట: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశం మేరకు గురువారం పోలీసులు జిల్లావ్యాప్తంగా వాహనాల తనిఖీ ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పట్టుబడిన రూ.7.49 లక్షల నగదును సీజ్ చేశారు. దామరగిద్ద మండలంలో రూ.75వేలు, ఊట్కూర్ పీఎస్ పరిధిలో రూ.1,05,640, మద్దూర్ పీఎస్ పరిధిలో రూ.51వేలు, కృష్ణా పీఎస్ పరిధిలో రూ.2.93 లక్షలు, నర్వ పీఎస్ పరిధిలో రూ.2.25లక్షలు పట్టుబడినట్లు ఎస్పీ తెలిపారు.

వ్యక్తి దారుణ హత్య..


గోవిందు (ఫైల్)


ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

గండేడ్/మహమ్మదాబాద్: మహబూబ్‌నగర్ జిల్లా గండేడ్ మండలం మన్సూర్‌పల్లిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. మన్సూర్‌పల్లికి చెందిన ఈరమోళ్ల గోవింద్ (45) కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ పని చేసుకునేవాడు. దసరా పండగ నిమిత్తం ఈనెల 23న స్వగ్రామానికి వచ్చాడు. పొలంలో పంటను పందులు పాడు చేస్తుండడంతో రాత్రివేళ కాపలా వెళ్లేవాడు. రోజు మాదిరిగానే బుధవారం రాత్రి పొలానికి వెళ్లాడు. గురువారం ఉదయం 7:30 గంటల ప్రాంతంలో అతడి పెద్ద కుమారుడు వెంకటేష్ పొలం వద్దకు వెళ్లి తండ్రి కోసం వెతకగా, కొద్ది దూరంలో లుంగీ కనిపించింది. అనుమానం వచ్చి మరి కొద్ది దూరం వెళ్లి చూడగా తండ్రి దారుణ హత్యకు గురై కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. గోవిందు తలకు వెనుక వైపు గాయంతో పాటు గదవ కింద గొంతుపై లోతైన గాయం ఉంది. పదునైన ఆయుధంతో దాడి చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనా స్థలానికి మహబూబ్‌నగర్ డీఎస్పీ మహేష్, టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఏఎస్ఐ అజంఅలీ చేరుకుని వివరాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్‌తో విచారణ నిర్వహించారు. గోవిందు పొలం నుంచి హత్య జరిగిన ప్రదేశం వరకు పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ మన్సూర్‌పల్లి గేట్ వరకు పరుగెత్తి, అక్కడి నుంచి నల్కర్‌పేట్ దారిలో అంతర్‌గంగ రోడ్డు వద్దకు వచ్చి ఆగిపోయింది. హత్య చేసిన వారు నల్కర్‌పేట్ వైపు వెళ్లినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ మార్చురీకి తరలించారు.

గ్రామంలో విషాదఛాయలు..

గోవిందు హత్యతో మన్సూర్‌పల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. మృతుడు అందరితో కలుపుగోలుగా ఉండేవాడని, ఎవరితో విరోధం లేదని, అలాంటి వాడిని హత్య చేయ డం ఎంతవరకు సమంజసమని పలువురు పేర్కొన్నారు. మృతుడికి భార్య ఈరమోళ్ల సత్యమ్మ, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురి దుర్మరణం

- పారుపల్లిలో పందిని తప్పించబోయి ఆటో బోల్తా
- ప్రభుత్వ ఉపాధ్యాయురాలి మృతి
- మరో నలుగురికి తీవ్రగాయాలు

కోయిల్‌కొండ/హన్వాడ/కొత్తకోటరూరల్/కల్వకుర్తి రూరల్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గురువారం వేర్వేరుగా చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందారు. మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే..


పద్మావతి (ఫైల్)

➡ మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పద్మావతి (40), జాయింట్ మెర్సి, పద్మప్రియ, లక్ష్మీ మానస, సయబాసు ల్తానా విధులు ముగించుకుని ఆటోలో మహబూబ్‌నగర్‌కు వెళ్తుండగా, పారుపల్లి స్టేజీ వద్ద పంది అడ్డురావడంతో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో పద్మావతి మృతి చెందగా, నలుగురు ఉపాధ్యాయులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి వారిని చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

➡ హన్వాడ మండలం వేపూర్‌కు చెందిన ఎర్ర రాజమ్మ (45) వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా, కోయిల్‌కొండ మండలం కొత్లాబాద్ వైపు వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. ప్రమాదంలో ఆమెకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

➡ వనపర్తి జిల్లా పెద్దమందడికి చెందిన మహ్మద్ అబ్దుల్ హాక్ (70) మోటారుసైకిల్‌పై కొత్తకోట నుంచి స్వగ్రామానికి వెళ్తూ, మోజర్ల స్టేజీ సమీపంలోని బుర్రవాగు వద్ద జాతీయ రహదారిని దాటుతుండగా.. కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

➡ నాగర్‌కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం గిడియానిపల్లికి చెందిన సాయిలు (60) బుధవారం రాత్రి కల్వకుర్తి నుంచి స్వగ్రామానికి నడుచుకుంటూ వెళ్తుండగా, గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. మృతుడి కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ వ్యక్తిగత వ్యవసాయ భూములకు పర్సనల్ రైతులకు, ఉద్యోగస్తులకు, వ్యాపారస్తులకు మొదలగు వారికి ఆర్థిక సలహాలు మరియు సహాయం చేయబడును. సంప్ర: 9084053557

BUSINESS OFFER

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్‌పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. Ph: 9310515624, 8800496710

WANTED

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం: 18K. Ph: 9848571888/ 9640400073

■ రామకృష్ణ గ్రూప్స్, (TS No.1) VJA, HYD శ్రీమంతులఇళ్ళలో వృద్ధుల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు వర్కర్స్ కావలెను / 24x7 వసతిగలము. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 96038 92233, 62812 08600

■ ప్రముఖ రియల్ ఎస్టేట్‌లో మార్కెటింగ్ చేయుటకు ఎగ్జిక్యూటివ్స్, మేనేజర్స్, టీం లీడర్స్, VRS & రిటైర్డ్ వారు (M/F) కావలెను హోటల్ అవంతి, Govt హాస్పిటల్ ఎదురుగా, మహబూబ్‌నగర్, Ph: 9000227227

■ శ్రీరామ్ చిట్స్ నందు బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు కావలెను (మార్కెటింగ్‌లో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత). క్రింది ప్రాంతాలలో కావలెను. మ.నగర్, వనపర్తి, గద్వాల, నారాయణపేట, నాగర్‌కర్నూల్, జడ్చర్ల. వ.30 లోపు బైక్ తప్పనిసరి. జీ:15000+ఇన్సెంటివ్+బోనస్. సంప్ర: శ్రీరామ్ చిట్స్, కోట కాంప్లెక్స్. Ph: 7207464118



గమనిక

- సాక్షి మేనేజర్